సాక్షి మంచిర్యాల

ఆదివారం : 14 : జనవరి : 2024

అయ్యగారికి దండం పెట్టు

చెన్నూర్: పల్లెల్లో గంగిరెద్దులు సందడి చేస్తున్నాయి. పాడి పంటలు చేతికి వచ్చే సమయంలో వచ్చే సంక్రాంతి పండుగ తెలుగువారింట ప్రత్యేకం. దీంతో గంగిరెద్దులు గ్రామాలకు వస్తున్నాయి. వేకువ జామునే డూడూ బసవన్నలు విన్యాసాలతో ఆకట్టుకుంటున్నాయి. హరిలోరంగ హరి అంటూ గ్రామాలకు వస్తున్న హరిదాసులు తమ సంకీర్తనలతో పల్లెలను మేల్కొలుపుతున్నారు. ఆధ్యాత్మికతను ప్రచారం చేస్తూ.. ఇంటింటికీ వెళ్లి.. భిక్షాటన చేస్తున్నారు. దీంతో పల్లెల్లో సంక్రాంతి సందడి కనిపిస్తోంది. ఇక గంగిరెద్దుల వాళ్లు.. నాయకులు, ప్రజాప్రతినిధుల ఇళ్లకు వెళ్లి.. అయ్యగారికి దండం పెట్టు.. అమ్మగారికి దండం పెట్టు అంటూ విన్యాసాలతో ఆకట్టుకుంటున్నారు. వాళ్లు ఇచ్చిన కానుకలు తీసుకుని వెళ్తున్నారు.



సంక్రాంతి.. సందళ్లు

ఊరూ వాడ.. పల్లె పట్టణం ఎటు చూసినా సంక్రాంతి సందడి కనిపిస్తోంది. వీధుల్లో హరిదాసుల సంకీర్తనలు.. డూడూ బసవన్నల విన్యాసాలు.. ముంగిళ్లలో రంగవల్లులు.. పిండివంటల ఘుమఘుమలు.. పిల్లలు, యువతీ, యువకుల కేరింతలు.. స్వస్థలాలకు చేరుతున్న ఆడ పడుచులు... కొత్త అల్లుళ్లతో ఎటు చూసినా పండుగ శోభ కనిపిస్తోంది.

- నేలతల్లి మురిసె.. నింగి మెరిసె..
- నేటి నుంచి మూడు రోజుల పండుగ..



సంక్రాంతి ముగ్గు వేస్తున్న యువతులు

మంచిర్యాలఅర్బన్: తెలుగువారు జరుపుకునే పండుగల్లో సంక్రాంతి పండుగకు ప్రత్యేక స్థానం ఉంది. సంక్రాంతి అంటే కొత్త వెలుగులు అని అర్థం. సంక్రాంతిని జరుపుకోవడం అంటే కొత్త వెలుగులకు స్వాగతం పలకడం. తెలంగాణలో జరుపుకునే అతి పెద్ద పండగ బతుకమ్మ, దసరా.. అలాగే ఆంధ్రప్రదేశ్?లో జరుపుకునేది సంక్రాంతి. మకరాశిలోకి సూర్యుడు ప్రవేశించే వేళ సంక్రాంతిని జరుపుకుంటారు. అలాగే భగీరథుడు గంగను భూలోకానికి తీసుకువచ్చి.. సగరులకు శాపవిమోచనం చేయించింది కూడా ఈ పండుగ రోజే అని పురాణాలు చెబుతున్నాయి. మూడు రోజుల ఈ ముచ్చటైన పండుగ రోజుల్లో రంగు రంగుల హరివిల్లులతో తీర్చిదిద్దిన లోగిళ్లు.. పసుపు కుంకుమలు వేసిన గొబ్బెమ్మలు.. భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల సంకీర్తనలు, పిండి వంటల ఘుమఘుమలు.. ఎటూ చూసినా పతంగులు, కొత్త అల్లుళ్లు.. సంక్రాంతి వచ్చిందంటే ఆనందడి వేరు. సంస్కృతి, జానపద కళల ప్రాముఖ్యత గల సంక్రాంతి భోగభాగ్యాలు, సిరిసంపదలు, ఇచ్చే పండుగగా ప్రసిద్ధి. భోగి, సంక్రాంతి, కనుమల మూడు రోజులపాటు ఇంటిల్లిపాది జరుపుకునే పండుగపై ప్రత్యేక కథనం.



భీమారం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న టీచర్

భోగి పండ్ల విశిష్టత...

భోగి రోజే పిల్లలకు పండ్లు తలపై పోస్తారు. సాయంత్రం వేళ చుట్టు ప్రక్కల పెద్ద వాళ్లను పిలిచి వారితో పిల్ల లకు దిష్టి తీయిస్తారు. గుప్పిట నిండా రేగుపండ్లు, చిల్లర నాణేలు, బంతి పూలలు, చెరకు ముక్కలతో పిల్లలకు మూడుస్లారు దిష్టి తీస్తారు. అన్ని రకాల దేవతామూర్తుల బొమ్మలను మహిళలు కళాత్మకంగా బొమ్మల కొలువుగా రూపొందిస్తారు.



భోగి మంటలు..

సంక్రాంతిలో తొలిరోజు జరుపుకునే పండుగ భోగి. వేకువజామునే తాటాకులతో మంట వేస్తారు. ఆ మంటల్లో ముందుగా సిద్ధం చేసుకున్న పాత వస్తువుల్ని వేస్తారు. మంటల మధ్యన నీటితో నింపిన కుండల్ని పెడతారు. ఆ మంటలకు కాగిన వేడి నీటితో భోగి స్నానాలు చేస్తారు. భోగి మంట ల్లో పాత వస్తువులు వేయడం వల్ల పీడ తొలగి భాగ్యాల్ని అందిస్తుందని ప్రజల వి శ్వాసం. మనలో ఉండే దుర్గుణాలకు మంటల్లో వేసి దహించివేసి కొత్త జీవితాన్ని ప్రారంభించాలనేది దీని వెనుక దాగిఉన్న మర్మం.

హరిదాసులు..

భక్తి ప్రచారోద్యమంలో హరిదాసులు ప్రముఖ పాత్ర పోషించారు. మార్గశిర మాసం శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైనది కాబట్టి హరిదాసులు నారదుని అవతారంలో ఇంటి ముంగిటకు వస్తారు. వారి శిరస్సున ఉండే పాత్రను అక్షయపాత్రగా భావించి దానం చేస్తారు. దానం చేసే కొద్ది పుణ్యం పెరుగుతుందని నమ్మకం.

రంగవల్లులు..

సంక్రాంతి అంటేనే రంగవల్లులు. ఈ పండుగ సందర్భంగా ముగ్గులకు ప్రాధాన్యం ఇస్తారు. మార్గశిర మాసంలో విష్ణుమూర్తిని ఆరాధించే ఇళ్లను పరిశీలించటానికి ప్రాతఃకాలలో లక్ష్మీదేవి సంచరిస్తుందని పురణాలు చెబుతున్నాయి. ముగ్గలతో తీర్చిదిద్దిన గృహ ప్రాంగణంలోకి లక్ష్మీదేవి ప్రవేశిస్తుందనే నమ్మకంతో తెల్లవారేసరికి ఇంటి ముందు రంగవల్లులు తీర్చిదిద్దుతారు. ఇంటి ముందు ముగ్గులు వేసేందుకు మహిళలు పోటీపడుతారు. ముగ్గులకు వేసే రంగులు కూడా మార్కెట్‌లో లభిస్తున్నాయి.

గొబ్బెమ్మకు పూజలు..

భోగి పర్వదినం సందర్భంగా మహిళలు ఇంటి ముంగిళ్లను రంగవల్లులతో సుందరంగా తీర్చిదిద్దుతారు. ఆవు పేడతో తయారు చేసిన గొబ్బెమ్మలు అందులో ఉంచి పూజలు చేస్తారు. గొబ్బెమ్మలను పార్వతీదేవిగా భావిస్తారు. ఆవు పేడ తెచ్చి గొబ్బెమ్మలు చేసి పసుపు, కుంకుమ, పిండి మొగ్గలు, గరిక పోచలతో అలంకరిస్తారు. నవధాన్యాలతో పూజించి ఏడాదంతా పాడిపంటలు, ధనధాన్యాలతో తుల తూగేలా చూడాలని పూజిస్తారు.

గాలి పటాల ఆనందం..

సంక్రాంతి పండుగ వేళ ముగ్గులకు ఎంత ప్రాధాన్యం ఉంటుందో.. గాలి పటాలకూ అంతే ప్రాధాన్యం ఉంటుంది. గాలిపటం ఎగిరేసేటప్పుడు చిన్నారుల్లో ఆనందం నింగికెగుస్తుంది. రంగు రంగుల గాలిపటాలు ఆకాశంలో హరివిల్లును తలపిస్తాయి. బెర్మ్యూడా, డెల్టా పాయిల్, త్రీడైమెన్షనల్ ఆకారాల్లో గాలిపటాలు లభిస్తున్నాయి. బాహుబలి, డ్రాగన్, స్పైడర్‌మెన్ చిత్రాలతోపాటు చిన్నారులకు నచ్చే కార్టూన్ బొమ్మలు జంతువులు పక్షుల బొమ్మలు ముద్రించిన రంగురంగుల పతంగులు అందుబాటులో ఉన్నాయి.

పండుగ అంటే హడావుడి..



సంక్రాంతి వచ్చిందంటే పది రోజుల ముందునుంచే పల్లెలు, పట్టణాల్లో హడావుడి ఉంటుంది. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలతో సందడిగా ఉంటుంది. సంప్రదాయాన్ని ముందు తరాలకు తీసుకెళ్లాలి. పిండి వంటల తయారీ ఐక్యత చాటుతుంది. – స్వప్న, మంచిర్యాల

పోటీపడి ముగ్గులు వేస్తాం..



సంక్రాంతి పండుగ వచ్చిదంటే పోటీపడి ముగ్గులు వేస్తుంటాం. మూడు రోజులు ప్రత్యేక ముగ్గులు సరేసరి. ఆవుపేడతో గొబ్బెమ్మలు పెట్టి వాటిపై పసుపు కుంకుమలు చల్లుతాం. అనేక రకాల పిండి వంటలు చేసి చుట్టు పక్కలా వాళ్లందరం కుటుంబ సభ్యుల్లా కలిసి కబుర్లు చెప్పుకుంటాం. – ప్రీతి, మంచిర్యాల

న్యూస్‌రీల్

ఫిబ్రవరి 6న అవిశ్వాసం

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌పై 16 మంది కౌన్సిలర్లు ఇటీవల ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై కలెక్టర్ బదావత్ సంతోష్ నోటీసులు అందించారు. ఫిబ్రవరి 6న క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాసంపై సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లు హాజరు కావాలని సూచించారు.

అవిశ్వాసంపై స్టే



మాట్లాడుతున్న శీలం రమేశ్

జన్నారం: పొనకల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) డైరెక్టర్లు కొందరు తనపై పెట్టిన అవిశ్వాసం నోటీసులపై హైకోర్టు స్టే ఇచ్చిందని చైర్మన్ శీలం రమేశ్ తెలిపారు. స్టే గడువు పూర్తయినా అవిశ్వాసం నెగ్గుత్తానని ధీమా వ్యక్తం చేశారు. తనకు డైరెక్టర్లతో ఎలాంటి విభేదాలు లేవని, కొందరు వెనుక ఉండి నడిపిస్తున్నారని ఆరోపించారు. చైర్మన్‌గా ఈ నాలుగేళ్లలో రైతులకు అన్ని విధాలుగా సహకారం అందించానని తెలిపారు.

30న అవిశ్వాసం

ఇదిలా ఉండగా హైకోర్టు ఈనెల 29 వరకు అవిశ్వాసంపై స్టే ఇచ్చింది. దీంతో ఈనెల 30న అవిశ్వాసంపై సమావేశం నిర్వహించాలని ఇన్‌చార్జి డీసీవో శ్రీనివాస్‌రెడ్డి చైర్మన్, డైరెక్టర్లకు శనివారం నోటీసులు జారీ చేశారు. చైర్మన్‌పై డైరెక్టర్ అల్లం రవితోపాటు మరో ఆరుగురు డైరెక్టర్లు హైదరాబాద్‌లోని కోఆపరేటివ్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు.

మహిళా భవనం కోసం స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని పోచమ్మ చెరువు కట్టపైన వాకర్స్ అసోసియేషన్‌కు, మహిళా సంఘ భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు శనివారం స్థల పరిశీలన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పలు భవనాలు నిర్మించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. నియోజకవర్గం వ్యాప్తంగా అవసరమైన భవనాలకు ప్రతిపాదనలు పంచేందుకు స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థలం ఉంటే ప్రభుత్వం భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు.

బెడిసి కొట్టిన 'అవిశ్వాసం' ఆట

- తెరవెనుక రాజకీయంతో తేలిపోయిన కౌన్సిలర్లు



బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట కౌన్సిలర్లు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్‌పై ప్రతిపాదించిన అవిశ్వాసం బెడిసి కొట్టింది. మెజారిటీ కౌన్సిలర్లకు చుక్కెదురైంది. అవిశ్వాసం నెగ్గడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. బలం ఉండి కూడా తెరవెనుక జరిగిన రాజకీయంతో కౌన్సిలర్లు చిత్తయ్యారన్న చర్చ జరుగుతోంది. బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత , వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్‌పై ప్రవేశ పెట్టిన అవిశ్వాసంపై శుక్రవారం ఓటింగ్ నిర్వహించారు. అయితే కోరం లేక అవిశ్వాసం వీగిపోయింది. బీఆర్ఎస్‌కు చెందిన 20 మంది కౌన్సిలర్లు అవిశ్వాసానికి అనుకూలంగా నెగ్గేందుకు చివరి వరకూ చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో నిరాశే మిగిలింది.

ఆ ఇద్దరిని కూడగట్టకనే..

మున్సిపాలిటీలో 34 మంది కౌన్సిలర్లు ఉండగా, ఓ కౌన్సిలర్ మరణించాడు. ప్రస్తుతం 33 మంది ఉన్నారు. వీరిలో బీఆర్ఎస్‌కు 21 మంది, ఇతర పార్టీల నుంచి చేరిన కౌన్సిలర్లతో కాంగ్రెస్ పార్టీకి 11 మంది కౌన్సిలర్ల బలం ఉంది. బీజేపీకి ఒక కౌన్సిలర్ ఉన్నారు. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం కోసం 22 మంది కౌన్సిలర్లు సంతకాలు చేసి కలెక్టర్ సంతోష్‌కు నోటీసు ఇచ్చారు. అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించడానికి ముహూర్తం ఖరారు కాగానే కౌన్సిలర్లు విడిపోయారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన వైస్ చైర్మన్ సుదర్శన్, బీజేపీ కౌన్సిలర్ అనితయాదవ్ గైర్హాజరు కావడంతో కోరం లేక అవిశ్వాసం వీగిపోయింది. ఆ ఇద్దరు కౌన్సిలర్లన మద్దతు తమకే అని నమ్మకంగా ఉన్న మెజార్టీ కౌన్సిలర్ల ఆశలన్నీ అడియాసలయ్యాయి.

పత్తా లేని బీఆర్ఎస్ అధిష్టానం..

అవిశ్వాసం ప్రకటించిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు అన్నింటికీ సిద్ధపడి శిబిరానికి వెళ్లారు. వారం రోజులకుపైగా క్యాంపులోనే ఉన్నారు. కానీ ఆ పార్టీ అధిష్టానం ఒక్క రోజు కూడా క్యాంపులో ఉన్న వారితో సంప్రదింపులు జరుపలేదు. చివరికి రాజీనామా అస్త్రం ప్రయోగించినా స్పందించలేదు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై కౌన్సిలర్లు పెట్టుకున్న ఆశలు గల్లంతయ్యాయి. అధిష్టానం తీరుపై బీఆర్ఎస్ కౌన్సిలర్లు గుర్రుగా ఉన్నారు.

తెరచాటు మంతనాలతో...

చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై తొలుత పార్టీలకు అతీతంగా అవిశ్వాసం ప్రకటించారు. అయితే తర్వాత తెరచాటు రాజకీయాలు వారి ఐక్యతను దెబ్బతీశాయి. అవిశ్వాసానికి మద్దతు తెలిపిన కౌన్సిలర్లలో కొంత మంది నెమ్మదిగా జరుకున్నారు. ఇందులో ఓ ముఖ్య ప్రజాప్రతినిధితోపాటు, మాజీ ప్రజాప్రతినిధి పాత్ర ఉందని తెలుస్తోంది. తెరచాటు మంతనాలతో సీన్ రివర్స్ కావడంతో అవిశ్వాసం వీగిపోయింది.

కార్గో పార్సిల్ చార్జీల పెంపు

- హమాలీ చార్జీల తగ్గింపు
- సాంకేతిక సమస్యలతో వినియోగదారుల ఇక్కట్లు



మంచిర్యాల బస్టాండ్ కార్గో కేంద్రం వద్ద సరుకులు ఎత్తుతున్న హమాలీలు

మంచిర్యాలఅర్బన్: నష్టాల ఊబిలో కూరుకుపోయిన ఆర్టీసీ లాభాల బాట పట్టేందుకు టికెటేతర ఆదాయంపై దృష్టి సారించి టీఆర్ఎస్ఆర్టీసీ లాజిస్టిక్(కార్గో) సేవలు ప్రవేశపెట్టింది. ఈ సేవలు విజయవంతం కావడంతో ఆదాయాన్ని సమకూర్చుకుంటోంది. తాజాగా పార్సిల్ చార్జీలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. హమాలీల చార్జీలను మాత్రం తగ్గించడంతో గిట్టుబాటు కావడం లేదని హమాలీలు వాపోతున్నారు. మరోవైపు కొత్త సాఫ్ట్‌వేర్ అమలుతో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. పార్సిల్ బుకింగ్ నుంచి ట్రాకింగ్ వరకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. పార్సిల్ బుకింగ్‌కు వచ్చే వినియోగదారులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

పెంపు ఇలా..

మంచిర్యాల డిపో పరిధిలో మంచిర్యాల, చెన్నూర్, లక్సెట్టిపేట, జన్నారంలో పార్సిల్, కొరియర్ సర్వీస్ కేంద్రాలు ఉన్నాయి. మంచిర్యాల డిపో నుంచి ఆయా ప్రాంతాలకు పార్సిళ్లు వేగంగా చేరవేసేలా ప్రణాళికలు రూపొందించారు. త్వరగా పాడయ్యే సామగ్రి(పూలు, తమలపాకులు ఇతరత్రా)కి రవాణాలో తొలి ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రధాన రూట్లలో వచ్చిన సరుకులు, పార్సిల్ వచ్చినట్లే పంపిస్తున్నారు. ఇదివరకు బ్లడ్‌బ్యాంకు నమూనాకు రూ.100 ఉండగా.. రూ.120కి పెంచేశారు. మంచిర్యాల నుంచి కాగజ్‌నగర్‌కు పాన్ ఆకుల బుట్టకు రూ.69 ఉండగా..రూ.90, మంచిర్యాల నుంచి చెన్నూర్‌కు ఐదు కిలోల పార్సిల్‌కు రూ.71 ఉండగా, రూ.95కి పెంచారు. ఇలా 20శాతం మేర పార్సిల్‌పై పెంచినట్లు తెలుస్తోంది.

హమాలీ చార్జీలు తగ్గింపు

బస్సుల్లో వచ్చే సామగ్రి దించి ఎత్తే కూలీలకు ఇదివరకు కిలో నుంచి 50కిలోల వరకు రూ.10, ఆపైన పార్సిల్‌కు రూ.20 ఇచ్చేవారు. తాజాగా పార్సిల్ చార్జీలను పెంచి ఆర్టీసీ యాజమాన్యం హమాలీల చార్జీలు తగ్గించింది. ప్రస్తుతం కిలో నుంచి ఐదు కిలోల వరకు రూ.5, ఐదు కిలోల నుంచి 25కిలోల వరకు రూ.7 ప్రకటించారు. కార్గో ద్వారా వచ్చే పార్సిళ్లు పది కిలోలలోపు ఎక్కువగా ఉంటాయని చెబుతున్నారు. సరుకుల రవాణా సందర్భంలో పార్సిల్ ఎత్తడం, దింపడం వరకు హమాలీల చార్జీలు తగ్గించడం వల్ల ఇబ్బందులు ఉంటాయని వాపోతున్నారు. రోజువారీ కూలి గిట్టుబాటు కాదని, పెరిగిన నిత్యావసర సరులకు ధరలకుఅనుగుణంగా పార్సిల్ చార్జీలు పెంచాలని హమాలీలు కోరుతున్నారు.

సాంకేతిక సమస్యలెన్నో..

కార్గోలో ఇదివరకు నెట్ ఎక్సల్ అనే సంస్థ సాఫ్ట్‌వేర్ ఉండగా ప్రస్తుతం ఫోకస్ సాఫ్ట్‌వేర్ మార్చారు. కొత్త సాఫ్ట్‌వేర్‌తో తరచూ సమస్యలు తలెత్తుతున్నాయి. బుకింగ్ నుంచి ట్రాకింగ్ వరకు గంటల కొద్దీ సమయం తీసుకుంటోంది. ఇదివరకు ఒక్కరే వ్యక్తి 10 పార్సిళ్లు తీసుకొస్తే అతని పేరిట ఒకేదాంట్లో నమోదు చేసి రశీదు ఇచ్చేవారు. ప్రస్తుతం మార్చిన సాఫ్ట్‌వేర్‌తో బార్‌కోడ్ వల్ల 10 సార్లు నమోదు చేయాల్సి రావడంతో సమయం వృథా అవుతోంది. గతంలో ట్రాకింగ్ నంబరుతో పార్సిల్ ఎక్కడ ఉందో ఇట్టే తెలిసిపోయేది. ప్రస్తుతం ట్రాక్ నంబర్, బస్ నంబర్, పలు వివరాలు నమోదు చేస్తేనే తెలుస్తుంది. తరచూ సర్వర్‌డౌన్, సాంకేతిక సమస్యల వల్ల గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుండడంతో వినియోగదారుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

నోరూరిస్తున్న గేవర్

- సంక్రాంతి స్పెషల్ స్వీట్...
- నెల రోజులే అందుబాటులో..



స్వీట్ హౌజ్‌లో సంక్రాంతి స్పెషల్ గేవర్‌లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): 'గేవర్' ఈ ప్రత్యేక స్వీట్ అంటే ఇష్టం ఉండనివారు ఉండరు.. ఇప్పుడు ఈ ప్రత్యేక 'గేవర్'తో పాటు 'మలాయ్ గేవర్' కూడా మార్కెట్‌లో లభిస్తుంది. ఈ రెండు ప్రత్యేక రకాల స్వీట్లు ఎప్పుడు పడితే అప్పుడు దొరకవు. కేవలం సంక్రాంతి స్పెషల్ స్వీట్‌గా గేవర్‌కు గుర్తింపు ఉంది. జనవరి నెలలో మాత్రమే వీటిని తయారు చేస్తారు. సంక్రాంతి అంటే చకినాలు.. అరిశెలే కాదు.. తియ్యనైన గేవర్ కూడా ఉంటుంది. ఇది రాజస్థాన్ స్పెషల్ స్వీట్.. కానీ ఇక్కడి వారికి ఈ స్వీట్ దొరికితే చాలు ఎంచక్కా లాగించేస్తారు. సాధారణ గేవర్ కిలో రూ.480 ఉండగా, మలాయ్ గేవర్ కిలో రూ.700లకు లభిస్తోంది.

సంక్రాంతికి స్పెషల్‌గా..



సంక్రాంతి పండుగ సందర్భంగా గేవర్ స్వీట్ తయారవుతుంది. చలి సమయంలోనే త యారు చేసే గేవర్‌కు ప్రత్యేక రుచి వస్తుంది. గేవర్ తిన్నవారు ఇక వదిలి పెట్టరు. చక్కెర గేవర్, మలాయ్ గేవర్ తయారు చేస్తున్నాం. – కమల్, గజానంద్ స్వీట్ హౌజ్ యజమాని

గిరిజనులకు ఉచితంగా విద్యుత్ మీటర్లు



పెద్దంపేటలో విద్యుత్ మీటర్ బిగించిన అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పెద్దంపేటలో కొలాంగూడ తండాలో శనివారం ఉచితంగా విద్యుత్ మీటర్లు బిగించారు. ప్రధాన మంత్రి జన జాతీయ ఆదివాస్ న్యాయ మహా అభియాన్ పథకంలో భాగంగా గిరిజన సంక్షేమ శాఖ, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత విద్యుత్ మీటర్లు బిగిస్తున్నారు. పెద్దంపేటలో ఏడుగురు లబ్ధిదారులకు ఈ ఉచిత విద్యుత్ మీటర్లు బిగించారు. ఎస్ఈ శేషారావు మాట్లాడుతూ గిరిజనులకు ఉచిత విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయడంతోపాటు నెలకు 100 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. గఢ్‌పూర్ పంచాయతీ పరిధిలోని కొలాంగూడ గిరిజనుల్లోనూ పది మందికి ఉచిత విద్యుత్ మీటర్లు త్వరలో బిగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంచిర్యాల విద్యుత్ డీఈ ఎంఎం.కైసర్, ఏడీఈ రాజశేఖర్, ఏఈ మహేందర్‌రెడ్డి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

మల్కేపల్లిలో..

కాసిపేట: మండలంలోని మల్కేపల్లిలో కొలాం ఆదివాసీ గిరిజనులకు శనివారం ఉచిత విద్యుత్ మీటర్లు అందించారు. ఎస్ఈ శేషారావు మాట్లాడుతూ కొలాం, తోటి తెగలకు చెందిన వారికి ప్రభుత్వం ఉచితంగా మీటర్, స్విచ్‌బోర్డు, సర్వీస్‌వైర్ అందిస్తుందని తెలిపారు. మల్కేపల్లిలో కొడప ప్రవంతి, కుడిమేత లక్ష్మికి కనెక్షన్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. డీఈ రాజన్న, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ స్వర్ణలత, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

టీఎన్‌జీవో జనరల్ సెక్రటరీకి సన్మానం



టీఎన్‌జీవో కేంద్ర సంఘం జనరల్ సెక్రటరీ మారం జగదీశ్వర్‌ను కలిసిన మంచిర్యాల జిల్లా ఉద్యోగులు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని వివిధ శాఖల ఉద్యోగులు, టీఎన్జీవో కేంద్ర సంఘం జనరల్ సెక్రటరీ మారం జగదీశ్వర్‌ను కరీంనగర్‌లోని టీఎన్‌జీవో భవన్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైనందుకు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్ మాట్లాడుతూ ఉద్యోగులు ఐక్యంగా ఉండాలని, టీఎన్జీవోను బలోపేతం చేయాలని సూచించారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల ఉద్యోగులు తిరుపతి, రామ్‌కుమార్, మల్లేశ్, అంజయ్య, కుమారస్వామి, అబూ, విజయ్‌కుమార్, కె.తిరుపతి, జమీర్, సంజీత్‌రావు, అంజు గంగమల్లు తదితరులు పాల్గొన్నారు.

దీప్తి మృతిపై విచారణ జరపాలి

దండేపల్లి: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి సమీపంలోని ఓ కాలేజీలో బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతున్న విద్యార్థిని రాథోడ్ దీప్తి అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ జరపాలని గిరిజన ఉపాధ్యాయ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రూప్లానాయక్, ప్రకాశ్ నాయక్ డిమాండ్ చేశారు. విద్యార్థిని మృతిపై విచారం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

మున్సిపల్ వైస్ చైర్మన్ సుదర్శన్‌పై ఫిర్యాదు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్‌పై వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఓ కౌన్సిలర్ ఫిర్యాదు చేశాడు. వైస్ చైర్మన్ తనను చంపుతానని ఫోన్ చేసి బెదిరించినట్లు 20వ వార్డు కౌన్సిలర్ గోషిక రమేశ్ ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

కాసిపేట: మండలంలోని ధర్మరావుపేట జిల్లా పరిషత్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 2006 నుంచి 2020 వరకు చదివిన విద్యార్థులు సమ్మేళనంలో పాల్గొనగా పూర్వ ప్రధానోపాధ్యాయుడు, ప్రస్తుత హాజీపూర్ ఎంఈవో జాడి పోశం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించి ఎందరో ఉన్నత స్థానాల్లో ఉన్నారని, జీవితంలో స్థిరపడిన వారు తాము చదివిన ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సాయం అందించాలన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాఠశాలలో పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంపత్, సత్తన్న, ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ నాయక్, ఎస్ఎంసీ చైర్మన్ బాణాల రాజమౌళి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ప్రేమ వ్యవహారం

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ శివారులో శుక్రవారం జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. కూతురు తండ్రికి ఇష్టం లేని పెళ్లి చేసుకుందనే కోపంతో కుమారుడితో కలిసి వియ్యంకుడిని హత్య చేసినట్లు నిర్ధారించారు. ఈ మేరకు డీఎస్పీ మల్లారెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్ శనివారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిర్మల్ మండలంలోని అనంతపేట గ్రామానికి చెందిన సంటి ప్రవళిక అదే గ్రామానికి చెందిన దగ్గరి బంధువైన పోలీస్ నవీన్‌ను ప్రేమించి ఆరు నెలల క్రితం పెళ్లి చేసుకుంది. ఈ పెళ్లి ఇష్టం లేని ప్రవళిక తండ్రి సంటి భీమన్న తమ ఊర్లో ఉండొద్దని, వేరే చోటికి వెళ్లి బతకమని చాలాసార్లు చెప్పాడు. నవీన్ తండ్రి పోలీస్ బుచ్చన్న(65) వారు ఎక్కడికి వెళ్లరని అనంతపేటలోనే ఉంటారని చెప్పేశాడు. దీంతో భీమన్న పోలీస్ బుచ్చన్న కుటుంబంపై కక్ష్య పెంచుకున్నాడు. అదును కోసం చూస్తున్న సమయంలో శుక్రవారం మధ్యాహ్నం పోలీస్ బుచ్చన్న నిర్మల్‌కు వెళ్లారన్న విషయం తెలుసుకొని బంగల్‌పేట్ శివారులోని జంగల్ హనుమాన్ దగ్గర మాటు వేశారు. బైక్ పైన బుచ్చన్న, అతడి చిన్నల్లుడు పడాల వెంకటేష్ రావడంతో వారిపై భీమన్న, ప్రమోద్ దాడి చేశారు. బుచ్చన్న తలపై తీవ్ర గాయాలు కావడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేష్ సైతం చనిపోయాడని నిందితులిద్దరూ అక్కడి నుండి పరారయ్యారు. పోలీసులు సీసీ కెమెరాలు, సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా దర్యాప్తు చేయగా భీమన్న, ప్రమోద్ నిందితులుగా తేల్చారు. శనివారం మండలంలోని కొండాపూర్ హైవేపై నిందితులను అరెస్టు చేశారు.

వనక్షేత్రంలో అమ్మవారు..



పూజలు చేసే రావుడ్ దేవత



పోచమ్మ ఆలయం

ఆదివాసీల కొంగుబంగారం, ఆరాధ్యదైవం..అమ్మవారి ఆలయం జనసంద్రం కానుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా అధికారులు ఏర్పాట్లు భారీగా చేయడంతో భక్తుల సంఖ్య పెరగనుంది. ఇప్పటికే రోడ్డు రవాణా సౌకర్యం కల్పించారు. మహరాజ్‌గూడ అడవుల్లోని బోరు నుంచి పైపుల ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించనుండగా.. హాల్ సైతం ఏర్పాటు చేశారు. పోచమ్మ ఆలయానికి రంగులు వేశారు. 20 సోలార్ విద్యుత్ లైట్లను అమర్చనున్నారు. ఆలయం వరకు సీసీ రోడ్డును వేశారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో ఏరోజుకారోజు శుభ్రం చేయించనున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.40కోట్లతో అభివృద్ధి చేయడం గమనార్హం!!

- నేటి నుంచి జంగుబాయి ఉత్సవాలు..
- తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో పుణ్యక్షేత్రం
- ఆరు రాష్ట్రాలకు చెందిన ఆదివాసీల ఆగమనం
- నెలరోజుల పాటు పూజలు జాతర
- ఏర్పాట్లు పూర్తి చేసిన కమిటీ నిర్వాహకులు

కెరమెరి(ఆసిఫాబాద్): ఎత్తైన గుట్టలు.. చుట్టూరా అడవులు.. అభయారణ్యం.. ఏపుగా పెరిగిన చెట్లు.. నడిచేందుకు కూడా భయపడే అభయారణ్యంలో జంగుబాయి వనక్షేత్రం..! లక్షలాది మంది ఆదివాసీలు పూజించే జంగుబాయి దేవతా ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతీ సంవత్సరం పుష్యం మాసం నుంచి ప్రారంభమై నెల రోజులు పాటు ఈ ఉత్సవాలు కొనసాగుతాయి. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు వివాదాస్పద ప్రాంతమైన కెరమెరి మండలంలోని ముకదంగూడ గ్రామ పంచాయతీకి చెందిన మహరాజ్‌గూడ గ్రామ అడవుల్లో జంగుబాయి దేవత కొలువై ఉంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వచ్చి ఇక్కడ బస చేసిందని పురాణాలు చెబుతున్నాయి.

గుహలో బస..

ఆదివాసీల ఆరాధ్యదైవం జంగుబాయి దేవత గుహలో బస చేసింది. పోచమ్మ ఆలయం వెనుక భాగంలోంచి పై భాగంలో జంగుబాయి దేవి ఉంది. అది పూర్తిగా గుహ కావడం వల్ల భక్తులు కూర్చునే నడుస్తారు. చిమ్మని చీకటిలో దీపం వెలుగులో ఆ దేవత కనిపిస్తుంది. పుష్యమాసంలో కనిపించే నెలవంక నుంచి జంగుబాయి జాతర అమావాస్య వరకు కొనసాగుతుంది.

ఎనిమిది గోత్రాల కుటుంబాలు ఒకే వేదికపై...

వివిధ రాష్ట్రాల్లోని జంగుబాయి వారసులైన వెట్టి, తుంరం, కొడప, రాయిసిడాం, సలాం, మరప, హెర్రకుంరం, మండాడి గోత్రాలకు చెందిన వేలాది కుటుంబాలు మొక్కులు చెల్లించుకుంటారు. వారు కేవలం కాలిబాట, ఎడ్ల బండ్లపై వందలాది కిలోమీటర్లు రవాణా సాగిస్తారు. ఎనిమిది గోత్రాలకు చెందిన కటోడాలు పుజారులుగా వ్యవహరిస్తారు. ఆలయ ప్రాంగణంలోనే నైవేద్యాలు తయారు చేసి సమర్పిస్తారు. ఏడేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపుతో కొంత అభివృద్ధికి నోచుకుంది.

ఆరు రాష్ట్రాలకు చెందిన ఆదివాసీలు రాక

నేడు తెలంగాణలోని అన్ని జిల్లాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన అనేక మంది ఆదివాసీలు రానున్నారు. తారురోడ్డు సౌకర్యం లేకున్నా రాళ్ల రప్పలు, దుమ్ము, ధూళిలో సైతం కొందరు కాలిబాటతో వస్తే మరికొందరు ఎడ్ల బండ్లపై వస్తుంటారు. ఎడ్లబండ్లకు పార్కింగ్ స్థలం, భక్తులకు అన్నదానం నిర్వహిస్తారు.

ఇలా చేరవచ్చు!

జంగుబాయి పుణ్యక్షేత్రానికి కెరమెరి మండలం నుంచి ఆనార్‌పల్లి మీదుగా ఉమ్రి వంతెన నుంచి పరందోళి మీదుగా... లేదా పరంధోళి సమీపం నుంచి ముకదంగూడ గ్రామానికి ఆనుకుని ఉన్న కచ్చా రోడ్డుతో వెళ్లవచ్చు. లేదా నార్నూర్ క్రాస్ రోడ్డు నుంచి కొత్తపల్లి మీదుగా.. ఆదిలాబాద్ నుంచి లొకారి మీదుగా జంగుబాయి దేవి వద్దకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం ఉంది.

సౌకర్యాలు కల్పిస్తాం..



జంగుబాయి దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పిస్తాం. తాగునీటి కోసం ముకదంగూడ అడవుల్లోని బోరు నుంచి పైపులు బిగించి నీటిని సరఫరా చేస్తాం. పారిశుధ్యం కోసం గ్రామ పంచాయతీ సిబ్బందిని నియమించాం. నెల రోజులు ఇక్కడే ఉండి చెత్తాచెదారం లేకుండా చూస్తారు.
– మహేందర్, ఎంపీడీవో, కెరమెరి

7వ తేదీ వరకు సాగుతాయి..



నేటి నుంచి ప్రారంభమైన జంగుబాయి ఉత్సవాలు ఫిబ్రవరి 7 వరకు కొనసాగుతాయి. ఆలయ ప్రాంగణంలో తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాలు సౌకర్యాలు కల్పిస్తున్నాయి. రహదారికి ఇబ్బంది లేకుండా బీటీరోడ్డు వేశారు. విద్యుత్ సౌకర్యం కూడా ఉంది. సోలార్లను అమర్చారు.
– కొడప జాకు, ఆలయ కమిటీ చైర్మన్



ముస్తాబైన అమ్మవారి ప్రాంగణం



అమ్మవారి గుహలోని దీపం



పవిత్ర స్నానాలు చేసే కొలను



జంగుబాయి గుహ

కార్మికులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న శంకర్‌రావు

- ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు

శ్రీరాంపూర్: కార్మికులకు ఏ సమస్య వచ్చిన అండగా నిలుస్తామని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు తెలిపారు. శనివారం ఆయన ఎస్సార్పీ–1 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కార్మికులు తమను ఆదరించి ఆరు ఏరియాల్లో గెలిపించారన్నారు. శ్రీరాంపూర్‌లో ఓడిపోయిన కూడా మంచి ఓట్లు వచ్చాయని, ఏరియాలో సమస్యల పరిష్కారం కోసం తమ యూనియన్ కృషి చేస్తుందన్నారు. గుర్తింపు సంఘంగా గెలిచిన సంఘం కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా యూనియన్ జాతీయ సమితి సభ్యులు భీంరావు, కేంద్ర ఉపాధ్యక్షులు కలవేన శ్యాం, డెప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, నాయకులు భీం రవి, వెంగళ కుమారస్వామి, వెంకటస్వామి పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడి

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అందవెల్లి, నాయకపు అనుకోడ, మోసం గ్రామాల్లో శనివారం ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్ ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గుడుంబా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఏఎస్సై హీరామన్, పోలీసు సిబ్బంది శంకర్, ప్రశాంత్, లింగయ్య, రజాక్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లపై కేసు..

మండలంలోని నాయకపుఅనుకోడ గ్రామశివారులో శనివారం పేకాటాడుతున్న ఎనిమిదిపై మందిని పట్టుకుని కేసు నమోదు చేశారు. వీరి వద్ద నుంచి 2100 రూపాయలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ పోటీలు



బహుమతి అందిస్తున్న కమిషనర్ భుజంగరావు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ పోటీలు శనివారం నిర్వహించారు. బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ ఆర్.భుజంగరావు హాజరై పోటీలను ప్రారంభించి మాట్లాడారు. చెస్‌తో మేధాశక్తి పెరుగుతుందన్నారు. విద్యార్థులు చెస్‌పై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. పోటీల నిర్వాహకులను అభినందించారు. ఈ టోర్నమెంట్ విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు..

ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ టోర్నీలో 65 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన ఐదుగురిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. యశ్వంత్(బెల్లంపల్లి), మనీరశ్మిత్(మంచిర్యాల), దేవాన్ష్(ఆసిఫాబాద్), జోత్స్న(బెల్లంపల్లి), విశ్వస్యజన్(మందమర్రి) రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు కరీంనగర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు. అర్జున చెస్ అకాడమీ ఫౌండర్ కోట సుధాకర్, జిల్లా అధ్యక్షురాలు స్వరూప, కోచ్ రాజేంద్రప్రసాద్, కుమురంభీమ్ జిల్లా సాంస్కృతిక సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద గోపాలకృష్ణ, టోర్నమెంట్ కన్వీనర్ దిలీప్‌కుమార్, ఆర్గనైజర్ గోపిరెడ్డి, పల్లెం సమ్మయ్య పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు ఇచ్చేందుకు అంగీకారం



మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు మొగిళి

రెబ్బెన(ఆసిఫాబాద్): వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ గేమ్స్ అండ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు అందించాల్సిన క్రీడాదుస్తులు, సామగ్రి అందించేందుకు సింగరేణి యాజమాన్యం అంగీకరించినట్లు ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి అన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని ఏఐటీయూసీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2021–22 సంవత్సరానికి సంబంధించిన క్రీడా సామగ్రితో పాటు క్రీడాదుస్తులు అందకపోవటంతో క్రీడాకారులు అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. దానిని గుర్తించిన ఏఐటీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, రాజ్‌కుమార్‌లు ప్రత్యేక చొరవ తీసుకుని కార్పొరేట్ లెవల్‌లో డైరెక్టర్లతో మాట్లాడారన్నారు. స్పందించిన యాజమాన్యం అన్ని ఏరియాలకు క్రీడా సామగ్రితో పాటు క్రీడా దుస్తులను అందజేసేందుకు అంగీకరించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్గనైజింగ్ కార్యదర్శులు కిరణ్‌బాబు, రాజేష్, ఖైరిగూడ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ నాయకులు నరేస్, సురేష్ కోరి, సమీ పాల్గొన్నారు.

కొత్త జూనియర్ అసిస్టెంట్లకు విధులు కేటాయించాలి



మాట్లాడుతున్న ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి యాజమాన్యం ఎక్స్‌టర్నల్ నియామక ప్రక్రియలో భాగంగా జూనియర్ అసిస్టెంట్‌గా నియమించబడిన 146 మందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సంవత్సరం సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్ల కోసం పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు గత నెలలో ఉద్యోగ నియామక పత్రాలు సైతం అందచేసిందన్నారు. ఉద్యోగాల్లోకి చేరిన రెండో రోజునే సింగరేణి గుర్తింపు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ రావడంతో ఉద్యోగ నియామకాలను నిలిపివేసి ఎన్నికలు పూర్తయ్యాక విధుల్లోకి తీసుకుంటామని తెలిపిందన్నారు. గుర్తింపు ఎన్నికలు పూర్తయి రెండు వారాలు గడుస్తున్నప్పటికీ వారిని ఉద్యోగాల్లోకి తీసుకోకపోవటం అన్యాయమన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం కొత్త జూనియర్ అసిస్టెంట్లకు విధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

క్లరికల్ సిబ్బందిని రిలీవ్ చేయాలి

యాజమాన్యం నిర్వహించిన కౌన్సెలింగ్ ద్వారా వివిధ ఏరియాలకు బదిలీ అయిన క్లరికల్ సిబ్బందిని వెంటనే రిలీవ్ చేయాలని మల్రాజు శ్రీనివాస్‌రావు కోరారు. క్లరికల్ సిబ్బందికి తమకు నచ్చిన ఏరియాలకు బదిలీ అయినప్పటికీ యాజమాన్యం రిలీవ్ చేయకపోవటంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారని అన్నారు. సమావేశంలో సెంట్రల్ కమిటీ నాయకులు మంగీలాల్, మాజీ ఏరియా ఉపాధ్యక్షుడు నల్లగొండ సదాశివ్, ఏరియా నాయకులు చంద్రశేఖర్, రవీందర్, వెంకటేష్, సమ్మయ్య, వీరస్వామి, వెంకటేష్, రమేస్, దేవేందర్, వెంకటేష్, ఓరం కిరణ్, స్వామి పాల్గొన్నారు.

సంక్రాంతి పూట.. గంగిరెద్దు బతుకాట

నిర్మల్: పొద్దుపొద్దున్నే.. 'పిపిపిపీ.. పిపిపిపీ..' అంటూ సన్నాయి ఊదుతూ.. 'ఓ తల్లీ.. నీ ఇంటిల్లిపాది సల్లంగుండాలని దీవెనలిచ్చేందుకు నీ వాకిట్లకి బసవన్నచ్చిండు.. ఓ అయ్య.. ఆ ఎములాడ రాజన్నే ఈ బసవన్నను నీ ఇంటికాడకు పంపించిండు..'

'ఓ.. దూడూ బసవన్న.. అగో సూడు బంగారుతల్లి నీకోసం చీర దెచ్చింది. నాకోసం అయ్య తొడుక్కున్న అంగి తీసుకచ్చింది. ఈ ఇంటి పిల్లా తల్లీ.. ఇంటిల్లిపాది సల్లంగుండాలని మనసారా దీవించు..' అంటూ పాటరూపంలో తను పాడుతూ ఉంటే.. ఆ బసవన్న తలఊపుతూ దీవిస్తున్నాడు. సంకురాత్రి సంబురాల్లో గంగిరెద్దుదే తొలి సందడి. గతంతో పోలిస్తే గంగిరెద్దుల సంఖ్య తగ్గింది. ఇప్పుడున్న వాళ్లూ.. ఇక మేమే ఆఖరేమో అంటున్నారు.

- బసవన్న ఆడితేనే.. బతుకు నడుస్తది
- ఊరూవాడా విడిచిపెట్టి..
- అన్ని ఊర్లూ తనవే అన్నట్లు..
- వాడవాడలా తిరిగే 'దూడూ బసవన్న'
- సంక్రాంతి పండుగలో భాగమైన..
- బసవన్నదే తొలి సందడి



గంగిరెద్దే పెద్దదిక్కు..

గంగిరెద్దంటే.. పరమశివుడి వాహనమైన నందిగా భావిస్తారు. భారీకాయంతో బసవన్నగా పూజలందుకుంటూ తనదైన ఆటతో అందరినీ ఆకట్టుకుంటుంది. ప్రధానంగా సంక్రాంతి వేళ గంగిరెద్దుల సందడి ఎక్కువగా ఉంటుంది. ఇక వాటిని పట్టుకుని ఆడిస్తూ.. వాటినే నమ్ముకుని జీవిస్తున్నవాళ్లను గంగిరెద్దులోళ్లు అని పిలుస్తాం. ఆ బసవడు ఆడితేనే తమ బతుకులు నడుస్తాయని వాళ్లు చెబుతున్నారు. కొన్ని వందల కుటుంబాలకు ఇప్పటికీ ఈ గంగిరెద్దే పెద్దదిక్కుగా ఉంది.

వలస జీవనం..

పైన నల్లని కోటు వేసుకుని, కింద తెల్లని ధోతి కట్టుకుని, నెత్తికి పాత పట్టుచీరను పట్కాగా చుట్టుకుని.. చేతిలో సన్నాయితో బసవన్నను పట్టుకుని దర్జాగా వచ్చే గంగిరెద్దులోళ్ల జీవితం పైకి కనిపించేంత దర్జాగా లేదు. ఎక్కడెక్కడికో వెళ్తూ.. వలస జీవనం చేస్తూ.. వాడవాడలా తిరుగుతూ.. గంగిరెద్దును ఆడిస్తేనే వారికి పూట గడుస్తుంది. నిర్మల్ జిల్లాలో ప్రస్తుతం ఉన్న గంగిరెద్దులోళ్లు వేములవాడ ప్రాంతం నుంచి వలస వచ్చారు. జిల్లా కేంద్రం శివారుతో పాటు పలు మండలాల్లో చిన్నపాటి గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు.

ఊళ్లను పంచుకుని..

అందరూ ఆస్తులను పంచుకుంటుంటే.. వాళ్లు మాత్రం ఊళ్లను పంచుకుంటారు. ఈ ఊరి నుంచి ఆ ఊరి దాకా.. గంగిరెద్దును ఆడించేందుకు వీళ్లకే హక్కు అన్నట్లుగా ముందే పత్రం రాసుకుంటారు. కొన్ని మండలాలకు కొన్ని కుటుంబాలు మాత్రమే ఆడించే హక్కును కలిగి ఉంటాయి. వాళ్లల్లో వాళ్లు రాసుకున్న ఈ పత్రానికీ 'విలువ' ఎక్కువే. ఎవరైనా.. తమ హద్దులు దాటి ఇంకొక్కరి పరిధిలోకి వెళ్తే రూ.లక్షకు పైగా జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఆ విధంగా రాసుకున్న బాండ్‌పేపర్లు, తమ పెద్దలు రాసిచ్చిన పత్రాలనూ వెంట పెట్టుకుని తిరుగుతుంటారు. ఇంట్లో ఆడవాళ్లు బుట్టల్లో పిన్నులు, కాంటలు, బొట్టుబిల్లలు పెట్టుకుని ఊరూరా తిరిగి అమ్ముకుని వస్తారు. ఇలా.. భార్యాభర్త కష్టపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.

ఆ 'కళ' తప్పుతుందేమో..

గంగిరెద్దును ఆడించడం ఓ అరుదైన కళ. ఒక ఎద్దును మచ్చిక చేసుకుని అది తమ మాటకు, పాటకు అనుగుణంగా ఆడటం, చేయడమంటే చాలా క్లిష్టమైన పని. ఇక్కడ ఇంకో ఆసక్తికరమైన విషయం ఉంది. గంగిరెద్దులకు ఆట నేర్పించడానికి వీళ్లలోనే ప్రత్యేక గురువులు ఉన్నారు. 'ఐదేళ్ల కిందట కదిలె పాపన్న దగ్గర ఈ గంగిరెద్దును ఇచ్చిండ్రు. చిన్న గుడ్డను తెచ్చుకుని సాకిన. ఏడాదిపాటు ఆట నేర్చుకునేందుకు కొండగట్టు దగ్గరున్న ఐలాపూర్ కేశవపట్నం గురువు దగ్గరికి పంపిన. రూ.25వేలు తీసుకుని ఆయనే ఏడాది బసవన్నకు తిండిపెట్టి ఆట నేర్పించాడు. ఇప్పుడు ఈ బసవన్న మా కుటుంబానికి తిండిపెడుతున్నడు..' అని గంగిరెద్దును నిమురుతూ నిర్మల్‌లోని మంజులాపూర్ లో ఉండే కొమురయ్య చెప్పాడు.

బసవన్నతోనే బతుకు..



నేను చిన్నగున్నప్పటి నుంచి బసవన్నతోనే ఉన్న. 20–25ఏళ్ల నుంచి గంగిరెద్దు ఆటాడిస్తున్న. ఆ బసవన్న ఆడితేనే మా బతుకులు నడుస్తున్నయ్. మా తర్వాత వాళ్లు ఇట్ల ఇబ్బందులు పడొద్దనే పిల్లలను చదివిస్తున్నం. – కొమురయ్య

ఇంకో పని తెల్వదు..



మా తాతముత్తాల నుంచి గంగిరెద్దును ఆడించడమే తెలుసు. మా తండ్రులు నేర్పిన ఈ విద్య తప్ప మాకు ఇంకో పని తెలవ్వదు. బసవన్ననే నమ్ముకుని బతుకుతున్నం. ఊరూరు సంచారం చేసుకుంటూ వచ్చినదాంతోనే బతుకులు వెళ్లదీస్తున్నాం. –మల్లయ్య

ఆదుకోవాలె..



గంగిరెద్దులను ఆడించడమూ ఓ కళనే. తరతరాలుగా వస్తున్న మా బతుకుదెరువుగా మారిన ఈ కళను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం మా కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నాం. –గంట రాములు

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

ఖానాపూర్: జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. ఏఎస్సై మనిరామ్ వివరాల ప్రకారం.. మండలంలోని మస్కాపూర్ గ్రామానికి చెందిన సాతం భీమన్న(40) భార్య కవిత ఆరు నెలల క్రితం తన ఇద్దరు పిల్లలను తీసుకొని పుట్టింటి వెళ్లి తిరిగి రావడం లేదు. భార్య రావడం లేదని జీవితంపై విరక్తితో శనివారం సాయంత్రం ఇంట్లోని దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపాడు.

దిందా అటవీ ప్రాంతంలో పులి సంచారం..?



గాలింపు చేపడుతున్న అటవీశాఖ సిబ్బంది

చింతలమానెపల్లి: మండలంలోని దిందా అటవీ ప్రాంతంలో పులి సంచారం శనివారం కలకలం సృష్టించింది. దిందా గ్రామానికి చెందిన రైతు జాడి మల్లయ్య తన పంట భూమిలో పనులు చేసుకోవడానికి వెళ్లగా పులి కనిపించడంతో గ్రామంలోకి పరుగు తీశాడు. గ్రామ సమీపంలోని వాగు వద్ద పులి కనిపించినట్లు గ్రామస్తులకు తెలుపడంతో వారు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. కర్జెల్లి రేంజ్ అధికారి చంద్రమౌళి ఆధ్వర్యంలో సెక్షన్, బీట్ అధికారులు చేరుకుని గ్రామస్తులతో కలిసి సమీపంలోని వాగు, అటవీప్రాంతం, పంట భూములను పరిశీలించారు. మహారాష్ట్ర వైపు వెళ్లి ఉంటుందనే అనుమానంతో గ్రామానికి సమీపంలో ఉన్న ప్రాణహిత నదిలో గాలించారు. పులికి సంబంధించిన ఆనవాళ్లు ఏమి లభించలేదని, అయినప్పటికీ పులి జాడ కోసం శాఖాపరంగా గాలింపు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, పనులు చేసుకునే వారు గుంపులుగా వెళ్లాలని గ్రామస్తులకు సూచించారు.